ఇంటర్‌లో స్టేట్ రెండో ర్యాంక్


యాట వైష్ణవి

శామీర్‌పేట్: మూడచింతలపల్లి మండలంలోని అద్రాస్‌పల్లికి చెందిన యాట నర్సింహులు కుమార్తె వైష్ణవి మంగళవారం విడుదలైన ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో 470 మార్కులకు గాను 463 మార్కులు సాధించి స్టేట్ రెండో ర్యాంక్ సాధించింది. ఈమె కేశవరంలోని వెంకటేశ్వర బాలాజీ జూనియర్ కళాశాలలో ఎంపీసీ చదువుతోంది. వైష్ణవి తల్లి చిన్నతనంలోనే చనిపోగా తల్లి లేని లోటు తెలియకుండా అన్నీ తానై తండ్రి చదివించగా ఆయన ఆశయాన్ని వైష్ణవి నిలపడంతో స్థానికులు, గ్రామస్తులతో పాటు కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డుకు అడ్డంగా ఉన్న స్తంభాలు తొలగించాలి


ఏఈతో మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్, మాజీ ఎంపీపీలు

ఘట్‌కేసర్: పట్టణంలో రైల్వే వంతెన నిర్మాణంలో రోడ్డుకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించాలని జేఏసీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి కోరారు. ఈమేరకు విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ యశ్వంత్ కుమార్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు నగేశ్ గుప్తా, కమలాకర్, సిరాజ్ పాల్గొన్నారు.

నీలం రామచంద్రయ్య సేవలు మరువలేనివి

జవహర్‌నగర్: కార్మిక వర్గానికి నీలం రామచంద్రయ్య చేసిన సేవలు మరువలేనివని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు కేజీ.రామచందర్ అన్నారు. ప్రగతినగర్‌లో నూతనంగా నిర్మించిన నీలం రామచంద్రయ్య భవన్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో అత్యధికంగా పేదలు నివసించే ప్రాంతంగా జవహర్‌నగర్ నిలుస్తుందని, పేదలు హక్కుల కోసం సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఎన్నో పోరాటాలు చేసి పరిష్కారం చూపిందన్నారు. కార్యక్రమంలో బూర్గుల ప్రదీప్, హన్మేష్, పద్మ, సంధ్య, నరేందర్, బాల్‌నర్సింహ, శివప్రసాద్, లక్ష్మీబాయి, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

'ఎర్లీ బర్డ్'ను సద్వినియోగం చేసుకోవాలి

పోచారం: ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపుదారులకు 'ఎర్లీ బర్డ్' పథకం కింద 5 శాతం రాయితీ ఇస్తున్నామని పోచారం మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను కింద రూ. 18 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. బకాయిలు, పన్నుల వివరాలను సంబంధిత బిల్ కలెక్టర్లు, మున్సిపల్ కార్యాలయంలో తెలుసుకోవచ్చని తెలిపారు. ఈనెల 30లోగా ఇంటి పన్ను చెల్లించి రాయితీని సద్వినియోగం చేసుకోవాలని గృహ యజమానులకు సూచించారు.

ప్రైవేట్ విద్యాసంస్థల ఎదుట విద్యార్థుల ధర్నా

మేడిపల్లి: మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓ ప్రైవేట్ పీజీ కాలేజీ యాజమాన్యం అధికంగా ఫీజులు వసూలు చేస్తూ వేధిస్తోందని ఆరోపిస్తూ విద్యార్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఈ మేరకు తరగతులు బహిష్కరించి కాలేజీ గేట్ ఎదుట ధర్నా చేశారు. అదనపు కోర్సుల పేరిట అధికంగా రూ.33 వేలు ఇవ్వాలంటూ కాలేజీ యాజమాన్యం వేధింపులకు గురిచేస్తోందని విద్యార్థులు ఆరోపించారు.

కాప్రా: ఈసీఐఎల్‌లోని ఓ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ నాయకులు మంగళవారం స్కూల్ ఎదుట ధర్నా చేపట్టారు. పేదలకు విద్యను దూరం చేసేలా డబ్బున్న వారికి మాత్రమే స్కూల్‌లో అడ్మిషన్లు అంటున్న యాజమాన్య తీరు దుర్మార్గమని దుయ్యబట్టారు. స్కూల్ విద్యాహక్కు చట్టం ప్రకారం నడుచుకుంటే ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు రాయితీతో అడ్మిషన్లు పొందుతారని పేర్కొన్నారు.

రోడ్డు విస్తరణ చేపట్టాలని కేంద్రమంత్రికి వినతి



మల్లాపూర్: హబ్సిగూడ నుంచి నాచారం వచ్చే రహదారి ఐఐసీటీ క్యాటర్స్ వద్ద రోడ్డు ఇరుకుగా ఉందని రోడ్డును విస్తరించాలని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్‌కు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినతిపత్రం అందజేశారు. ఎంపీ ఈటల రాజేందర్, నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్, ఐఐసీటీ శ్రీనివాస్‌రెడ్డి, సీసీఎంబీ డైరెక్టర్ తదితరులు ఉన్నారు.

భూ భారతిపై సందేహాలుంటే దృష్టికి తీసుకురండి

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- తూంకుంటలో అవగాహన సదస్సు


కార్యక్రమంలో రైతులు, స్థానిక నాయకులు

శామీర్‌పేట్: భూ భారతిపై ఎలాంటి సందేహాలున్నా రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. తూంకుంటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శామీర్‌పేట మండల ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని రైతులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ప్రైవేట్ సర్వేయర్లను నియమించవద్దని రైతులు కలెక్టర్‌ను కోరగా, భూమి కొనుగోలు, విక్రయాలు రిజిస్ట్రేషన్ సమయంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లతో భౌతిక సరిహద్దుతో చేయించిన ల్యాండ్ మ్యాప్‌లను ప్రభుత్వ సర్వేయర్లు మళ్లీ ఆమోదించిన తర్వాతే రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లలో ల్యాండ్ మ్యాపులు వస్తాయని, దీనివల్ల ఎవరికీ నష్టం జరగదని పకడ్బందీగా భూ సరిహద్దులు ఉంటాయని కలెక్టర్ వివరించారు. సదరు రైతు ఒప్పుకుంటేనే భూ సర్వే చేస్తామని తెలిపారు. ధరణి వల్ల పీఓబీ సమస్యలు అధికంగా ఉన్నాయని, భూ భారతి చట్టంలో పీఓబీ రద్దుచేసే అధికారం కల్పించారని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. భూ భారతి చట్టంతో రెవెన్యూ అధికారులపై బాధ్యత మరింత పెరిగిందని, ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందన్నారు. భూ భారతి 2025 చట్టంలో 23 సెక్షన్లు, 18 నిబంధనలున్నాయన్నారు. భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థతో రైతులకు న్యాయబద్ధమైన మార్గం కల్పిస్తోందని తెలిపారు. ఇంటి స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడం, భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయసాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కీసర ఆర్డీఓ ఉపేందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, శామీర్‌పేట్ తహసీల్దార్ యాదగిరిరెడ్డి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

నైపుణ్యం వెలికితీసేందుకే వేసవి శిబిరం

సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి



మాట్లాడుతున్న గురుకులాల కార్యదర్శి వర్షిణి

ఘట్‌కేసర్: విద్యార్థుల్లోని నైపుణ్యం వెలికితీసేందుకే వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి పేర్కొన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎదులాబాద్‌లోని ఫైన్ ఆర్ట్స్ స్కూల్, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల్ ఉప్పల్ బాలుర పాఠశాలలో రాష్ట్రస్థాయి వేసవి శిబిరాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించి పెయింట్, మట్టితో కుండల తయారీ, కార్టూన్, జర్నలిజం, చేతి రాత నైపుణ్యం, నేచర్ లీడర్స్, ఫొటోగ్రఫీ, వేదిక్ మ్యాథ్స్, డ్రాయింగ్, బంజారా ఎంబ్రాయిడరీలో శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కార్యదర్శి సక్రునాయక్, స్టేట్ ఆఫీసర్, భీమయ్య, జోనల్ ఆఫీసర్ నిర్మల, రజనీ, డీసీఓ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ రాము, వైస్ ప్రిన్సిపాల్ రాములు, వెంకటేశం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు

కీసర: ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన భూ భారతి చట్టంపై ఈనెల 24న మండలవ్యాప్తంగా ఉన్న రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తహసీల్దార్ అశోక్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు చీర్యాల చౌరస్తాలో గల జయమోహన్ గార్డెన్‌లో సదస్సు ప్రారంభమవుతుందని వివిధ గ్రామాలు రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు డబుల్ బెడ్రూంలకు ఇంటి నంబర్ల కేటాయింపు

పోచారం: ప్రతాపసింగారం, వెంకటాపూర్ ప్రాంతాల్లో ప్రభుత్వం నిర్మించిన 'డబుల్ బెడ్రూం ఇళ్ల'కు ఈనెల 23న (నేడు) ఇంటి నంబర్లు కేటాయించనున్నట్లు పోచారం మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు విచారణ నిమిత్తం డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయానికి మున్సిపల్ అధికారులు వెళ్తారని లబ్ధిదారులు ఇంటి పట్టా సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, రేషన్ కార్డును అధికారులకు అందించాలని సూచించారు.

అధిక లాభాలు వస్తాయని ..

- ఆశ చూపి భారీగా డిపాజిట్లు సేకరించి.. జంప్
- కీసర పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు

కీసర: అధిక లాభాలు వస్తాయని ఆశ చూపి, ఆన్‌లైన్ కంపెనీ పేరిట భారీగా డిపాజిట్లు సేకరించిన నిందితులు పత్తా లేకుండాపోవడంతో బాధితులు మంగళవారం కీసర పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కీసరలో కొన్ని రోజులుగా నివసిస్తున్న నాగుల నర్సింహాస్వామి కరీంనగర్‌కు చెందిన గట్టు కుమారస్వామితో కలిసి దమ్మాయిగూడలోని పద్మశాలీ కాలనీలో కార్యాలయం ఏర్పాటు చేశారు. లేకా బిట్ కాయిన్ స్కీమ్‌పేరిట ఆన్‌లైన్ వెబ్‌సైట్ ప్రారంభించారు. దమ్మాయిగూడతో పాటు కీసరలోని పలువురికి రూ 10 వేల పెట్టుబడి పెడితే ఏడాదికి రూ. 30 వేల లాభం వస్తుందని ఆశచూపారు. దీంతో పలువురు నమ్మి ఒక్కొక్కరు రూ. 10 వేల నుంచి రూ లక్షల్లో పెట్టుబడులు పెట్టారు. దమ్మాయిగూడలోనే దాదాపు రూ. 3 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టినట్లు తెలిసింది. అయితే ఒక్కసారిగా ఆన్‌లైన్ వెబ్‌సైట్ ఎత్తేయడంతో మంగళవారం బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కీసరకు చెందిన రాగుల శ్రీరంగం దాదాపు రూ. 11 లక్షల వరకు పెట్టుబడి పెట్టి మోసపోయానని తనకు న్యాయం చేయాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కీసర సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ఇంటర్‌లో ఫలితాల్లో గురుకుల కళాశాల విద్యార్థుల సత్తా

కీసర: కీసరగుట్టలోని ప్రభుత్వ గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారని ప్రిన్సిపాల్ కె. తాతారావు తెలిపారు. ఎంపీసీ విభాగంలో 37 మంది పరీక్షలు రాయగా 32 మంది (86.49) శాతం ఉత్తీర్ణులయ్యారు. బైపీసీలో 30 మందికి 24 మంది(80 శాతం) ఉత్తీర్ణులయ్యారు.

అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో 37 మంది పరీక్షలు రాయగా 34 మంది ((91.89 శాతం), బైపీసీలో 25 మందికి 23 మంది (92 శాతం) ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ ఎంపీసీలో ఎం. కల్యాణ్ 989 మార్కులు, ఎస్. ధన్‌రాజ్ 986, కె. అశోక్ 948, బైపీసీలో కె. పవన్‌కుమార్ 948, ఎన్. కృష్ణకుమార్ 946, ఎంఎస్ నాగ వెంకట ప్రణయ్ కౌండియ్య 922 మార్కులు సాధించారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి వారోత్సవాలు

కీసర: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వారోత్సవాల్లో భాగంగా నాగారం మున్సిపాలిటీలోని ఎస్సీ కాలనీలో ఎర్ర వామన్ ఇంట్లో మంగళవారం నిర్వహించిన సహపంక్తి భోజన కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి స్థానిక బీజేపీ నేతలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహపంక్తి భోజనం ద్వారా సామాజిక సమానత్వానికి మద్దతు ప్రకటించాలన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కొండబోయిన నాగరాజు, బలరాం, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, వేణుగోపాల్, రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వర రావు, రాహుల్‌రెడ్డి, శ్రీనివాస్, జూపల్లి నరేశ్, భువనేశ్వరి, సతీశ్‌రెడ్డి, మాధవరావు, శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, షాజీనాయర్, విజయలక్ష్మి, మధుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.


సహపంక్తి భోజనంలో చంద్రారెడ్డి, బీజేపీ నేతలు

ఇంటర్‌లో శ్రీ చైతన్య, రుషి విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన శ్రీ చైతన్య, రిషి విద్యార్థినులు

ఘట్‌కేసర్: పట్టణంలోని శ్రీ చైతన్య, రుషి బాలికల కళాశాల విద్యార్థులు మంగళవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో సింధు 987/1000, హరిషితరెడ్డి 984/1000, బైపీసీలో ఖుష్బియా 987/1000, శ్రీవల్లి 983/1000, సీఈసీలో సీనియర్‌లో మశ్చేందర్ 969/1000, దీక్షిత్ 951/1000. ఎంపీసీ జూనియర్ విభాగంలో నాజియా 461/470, చరణ్‌కుమార్ 459/470లు, ఎంఈసీ జూనియర్ విభాగంలో దీక్షర 492/500, బైపీసీ జూనియర్ విభాగంలో హారిక 432/440, వైష్ణవి 426/440, మహాలక్ష్మి 483/500, సాత్విక్‌గౌడ్ 483/500 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు పద్మారెడ్డి, రవీందర్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.



శృతి
987/1000

టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాల ..

మేడ్చల్: మేడ్చల్ కిష్టాపూర్ టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంఈసీలో శృతి 987/1000, సీఈసీలో సౌమ్య 983/1000, ప్రథమ సంవత్సరం సీఈసీలో శోభారాణి 494/500, ఎంఈసీలో నేహా 488/500 మార్కులు సాధించారు.

లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం నివారించాలి

సాక్షి,సిటీబ్యూరో: రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యాన్ని నివారించాలని కోరుతూ డీహెచ్‌పీఎస్ జిల్లా నేతలు కలెక్టర్ గౌతమ్‌ను కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ కాలనీలు, వాడల్లో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అలాగే దళితులపై దాడులకు పాల్పడిన వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని మిగులు భూములను ఇళ్లు లేని నిరుపేద ఎస్సీలకు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి కే.సహదేవ్, నాయకులు చిలిముల మల్లేశం, నరేందర్, శంకర్ పాల్గొన్నారు.


డీఆర్‌ఓ హరిప్రియకు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

గ్రామాల్లో 'జైబాపు, జై భీమ్ జై సంవిధాన్'

మేడ్చల్‌రూరల్: గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని జ్ఞానాపూర్, బాసిరేగడిలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం 'జై బాపు, జై భీమ్ జై సంవిధాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్, జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి మరిలమ్మ, మున్సిపల్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహులు యాదవ్ పాల్గొన్నారు. కేంద్ర రాజ్యాంగాన్ని కాలరాస్తుందంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు రవి ముదిరాజ్, మహిళా కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షురాలు కోమలత, మాజీ సర్పంచ్ సురేందర్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్, నాయకులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా ప్రపంచ ధరిత్రి దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కీసర: రాంపల్లి జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ పాఠశాలలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. పాఠశాల ప్రాంగణంలోని ఆర్గానిక్ గార్డెన్‌లో ఆయుర్వేద, ఇతర వృక్షాల వల్ల కలిగే లాభాలు, మొక్కల పూర్తి వివరాలు తెలుసుకునేందుకు వృక్షాలకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశామని, దానిని స్కానింగ్ చేయగానే వాటి పూర్వాపరాలు మొత్తం మనం తెలుసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు 'ధరిత్రి రక్షణకు మనం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..మన బాధ్యత ఏంటి' అనే విషయాలతో కూడిన ఉపన్యాసం ఆకట్టుకున్నది.

బ్రహ్మోత్సవాలకు భారీ బందోబస్తు

కీసర: చీర్యాల లక్ష్మీనృసింహ్మ స్వామి బ్రహోత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని కీసర సీఐ శ్రీనివాస్ అన్నారు. ఆలయం వద్ద ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆలయానికి వచ్చే భక్తులు, యాత్రికులు పోలీసుల సూచనల మేరకు వాహనాలను పార్కింగ్ చేసుకోవాలన్నారు. అదేవిధంగా క్యూలైన్లలోని భక్తులకు వీలైనంత త్వరగా స్వామి దర్శనం కలిగేలా దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయాలని ఆలయ ధర్మకర్త శ్రీహరిగౌడ్‌కు సూచించారు. ఆయన వెంట ఎస్ఐ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న కీసర సీఐ శ్రీనివాస్

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మేడ్చల్: పోషకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా సూచించారు. మేడ్చల్ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై పిల్లల పలకలపై అక్షరాలు దిద్దించి, గర్భిణులకు వాయినాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారం తప్పకుండా తీసుకోవాలన్నారు. అలాగే ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కాంతమ్మ, మండల, మున్సిపల్ అధికారులు, ఐసీడీఎస్, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా

హిందువులపై దాడులకు నిరసనగా ర్యాలీ


ర్యాలీ చేస్తున్న బీజేపీ నేతలు

కీసర: పశ్చిమబెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ శివాజీ సేవా సమితి ఆధ్వర్యంలో నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లి చౌరస్తాలో మంగళవారం నిరసన ర్యాలీ చేపట్టగా బీజేపీ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ.. హిందువులపై దాడులను అక్కడి ప్రభుత్వం వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు శ్యాంసుందర్‌శర్మ, బిజ్జ శ్రీనివాస్, రవీందర్, వెంకటేశ్వర్లు, హేమ, నాగరాజు, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో వ్యక్తి రిమాండ్

ఘట్‌కేసర్: విద్యుత్ సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తిని ఘట్‌కేసర్ పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ విద్యుత్ సబ్‌స్టేషన్ అసిస్టెంట్ లైన్‌మెన్ గుగులోతు విన్‌ద్‌కుమార్, సహచరుడు పవన్‌కల్యాణ్, మీటర్ రీడర్ లక్ష్మణ్‌తో కలిసి ఘట్‌కేసర్‌లోని మధుగోని గోపాలకృష్ణ ఇంటికి విద్యుత్ బిల్లు వసూలు కోసం జనవరి 31, 2025న వెళ్లారు. బిల్లు కట్టేది లేదు.. ఏం చేసుకుంటారో చేసుకోండి.. మళ్లీ బిల్లు కోసం వస్తే చంపేస్తానని బెదిరించాడు. ఈ విషయమై ఫోన్లో రికార్డు చేసేందుకు అసిస్టెంట్ లైన్‌మెన్ పవన్ కల్యాణ్ ప్రయత్నించగా గోపాలకృష్ణ బలవంతంగా ఫోన్ లాక్కొని ధ్వంసం చేసి వారిపై దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మంగళవారం నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.


మధుగోని గోపాల కృష్ణ

భూములకు హద్దులు ఏర్పాటు చేయాలి

- కీసర తహసీల్దార్ జాప్యాన్ని నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట ఆందోళన
- కలెక్టర్‌కు రాంపల్లి దాయర రైతుల వినతిపత్రం అందజేత

సాక్షి,సిటీబ్యూరో: పట్టా భూముల సర్వే చేపట్టి హద్దులు నిర్ధారించకుండా కీసర తహసీల్దార్ అశోక్ కుమార్ అడ్డుకుంటున్నారని, న్యాయం చేయాలని కోరుతూ రాంపల్లి దాయర రైతులు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి దాయరలోని సర్వే నంబర్ 617 లో 10 మంది రైతులకు 13.02 ఎకరాల పట్టా భూమి ఉందని, దాని పక్కనే 618 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ భూములను సర్వే చేసి, రెండింటి మధ్యన హద్దులు నిర్ధారించి రాళ్లు పెట్టాలని కోరామన్నారు. ఈ నేపథ్యంలోనే మండల, జిల్లా సర్వే అధికారులు వచ్చి భూమి కొలిచి హద్దులు ఏర్పాటు చేయగా, కీసర తహసీల్దార్ అశోక్ కుమార్ జోక్యం చేసుకుని హద్దు రాళ్లను తొలగించారని రైతులు ఆరోపించారు. దీంతో తహసీల్దార్‌ను అడగగా, సమీప భూములకు సంబంధించిన వారు ఫిర్యాదు మేరకు హద్దు రాళ్లను తొలగించినట్లు తెలిపారన్నారు. రాజకీయ నాయకుల ఒత్తిడి కారణంగానే తొలగించినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సర్వే నంబర్ 617 పట్టా భూమిలో వెలిసిన గుడిసె వాసులతో రెవెన్యూ ఉద్యోగులు లాలూచీ పడడం వల్లే హద్దులు ఏర్పాటు చేయడం లేదని రైతులు ఆరోపించారు. ఇప్పటికైనా కలెక్టర్ జోక్యం చేసుకుని పట్టా, ప్రభుత్వ భూముల మధ్య హద్దుల నిర్ధారణకు సర్వే చేపట్టాలన్నారు. అంతకుముందు తహసీల్దార్ జాప్యానికి నిరసనగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట కొద్దిసేపు ఆందోళన చేపట్టారు.వినతిపత్రం అందించిన వారిలో రైతులు కే.సుధాకర్ రెడ్డి, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, జి.వెంకట్ రెడ్డి, ఆర్.రాజిరెడ్డి, కె.శ్రీనివాస్ రెడ్డి, కంసాని బాల్‌రెడ్డి, రా మిడి సంజీవరెడ్డి, రమేశ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

